నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | ఫిబ్రవరి 09, 2024 | www.navatelangana.com

ఓపెన్ పరీక్ష ఫీజు 21వరకు చెల్లించాలి

- అపరాధ రుసుంతో మార్చి 3వరకు అవకాశం
- స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గంగాకిషన్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలో ఓపెన్ పది, ఇంటర్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులు పరీక్ష ఫీజును ఈనెల 12 నుంచి 21 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గంగాకిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఓపెన్ పది, ఇంటర్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులు మాత్రమే కాకుండా ఫెయిల్ అయిన వారు కూడా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని, అపరాధ రుసుంతో వచ్చేనెల మార్చి 3వరకు చెల్లించాలని పేర్కొన్నారు. మిగతా వివరాలకు పాఠశాల పని వేళల్లో లేదా సెల్ 9866343898 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జూనియర్ కాలేజీని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రిన్సిపాల్ విజయనందరెడ్డి

నవతెలంగాణ నిజాంసాగర్

మండల కేంద్రంలోని నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాలను వచ్చే అకాడమిక్ ఇయర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయనందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంసాగర్ మండలంలో నూతన కళాశాల మంజూరైందని వచ్చే సంవత్సరం నుంచి రెగ్యులర్ క్లాసులు జరుగుతాయని ఆయన తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సీఈసీ, హెచ్‌ఈసి గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే అకాడమిక్ ఇయర్‌కు అడ్మిషన్లు కూడా త్వరలో ప్రారంభిస్తామని అలాగే ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంటుందని, బస్‌పాస్ సౌకర్యం కూడా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నిధులు మిగిలితేనే..

లేదంటే పన్ను వసూళ్లైనా వందశాతం చేయాలి.. అప్పుడే పంచాయతీ కారోబార్లకు వేతనాలు

- లేదంటే అంతే సంగతి
- రెండు నెలలుగా వేతనాలు అందని వైనం
- కుటుంబాల పోషణ కష్టమవుతోందని ఆవేదన

నవతెలంగాణ-వర్ని

గ్రామ పంచాయతీ కారోబార్‌లకు రెండు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులు గ్రామాభివృద్ధికి పోనూ.. అందులో మిగులు నిధులుంటేనే వారికి జీతాలు చెల్లిస్తున్నారు. లేదంటే పన్నులు వందశాతం పూర్తి చేస్తే.. అందులోనుంచి చెల్లిస్తున్నారు. లేకుంటే పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం పంచాయతీ కారోబార్లకు గత రెండు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుటుంబాల పోషణ కష్టమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించి కనీస వేతనం రూ.25 వేలకు పెంచాలని పంచాయతీ కారోబార్‌లు గతంలో పోరాటం సైతం చేశారు. అయినా తమను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 520 మంది కారోబార్లు పనిచేస్తున్నారు. పంచాయతీలో ఎక్కడ ఏ వాడల్లో తాగునీరు రాకపోయినా, విద్యుత్ దీపాలు లేకపోయినా ముందుగా గ్రామస్తులు అడిగేది కారోబార్లనే. పంచాయతీలలో జనరల్ ఫండ్ లేకుంటే బయట నుంచి అప్పు తీసుకొచ్చి గ్రామాలలోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కారం చేస్తారు. పంచాయతీలను అన్నీ వారే ఉన్నప్పటికీ వారికి చెల్లించే వేతనం మాత్రం రూ.9వేలే. ఇదిలా ఉండగా.. గ్రామ పంచాయతీల్లో పనిచేసే కారోబార్లుకు గత మూడు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో బయట అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయంలో కారోబార్లు తమ సమస్యలను పరిష్కరించి కనీస వేతనాలు చెల్లించాలని సైతం డిమాండ్ చేశారు.


సమ్మెలో భాగంగా సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేస్తున్న కారోబార్లు (ఫైల్)

పని వీరిది.. అవార్డులు అధికారులకు..

పంచాయతీ పారిశుధ్య పనులలో ముందస్తుగా ఉండి అన్ని చోట్ల నీటి వసతి, చెత్తచెదారాన్ని తొలగింపచేయడం, హరితహారం మొక్కల ఎదుగుదలకు తోడ్పడుతూ మల్టీ పర్పస్ విధానంతో కారోబార్లు పనిచేస్తున్నారు. అయినా తమకు మాత్రం గుర్తింపు లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అన్ని తామై నడిపిస్తున్నా.. అవార్డులు, రివార్డులు పైఅధికారులకే ఉండటం తమకు అవమానకరంగా ఉంటుందని వారంటున్నారు. ఇప్పటికైనా తమ కష్టాలను తెలుసుకుని కొత్త ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని, సమయానికి వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కారోబార్లు కోరుతున్నారు.

మిగులు లేకుంటే పస్తులే..

పంచాయతీకి సెంట్రల్ నుంచి వచ్చే నిధులు, జనరల్ ఫండ్ నిధులతో పంచాయతీ అభివృద్ధికి ఖర్చు కాగా.. అనంతరం మిగులు నిధులుంటేనే కారోబార్లకు ప్రస్తుతం వేతనాలు చెల్లిస్తున్నారు. లేదంటే ప్రజల నుంచి పూర్తి స్థాయిలో ఇంటి పన్ను, నీటి పన్ను టార్గెట్ పెట్టి.. అవి వసూలు అయితే తప్ప కారోబార్లకు పంచాయతీలు వేతనాలు చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వ నిధులు వచ్చే వరకూ వేచి చూడాల్సి వస్తోంది. సరైన సమయంలో వేతనాలు చెల్లించకపోవడంతో కారోబార్లు అప్పులు చేసి మరీ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

పంచాయతీ పాలకవర్గ తీర్మానంలో పంచాయతీ కారోబార్లుగా తమను పనిచేయించు కుంటున్నా.. పంచాయతీలు జీతాలు చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నాయి. నెల తరబడి జీతాలు ఇవ్వకపోవడం ఇబ్బందిగా మారింది. పంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చే జనరల్ ఫండ్, 15 ఫైనాన్స్ నిధులు వచ్చినప్పుడు గ్రామ పంచాయతీలో పనులన్నింటికి చెల్లించి, మిగిలితే వాటి నుంచి తమకు వేతనాలు చెల్లిస్తున్నారు. లేకపోతే తమకు వేతనాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం తమను పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలి.

- చింతకుంట కారోబార్ ప్రశాంత్.

వేతనాలు చెల్లించాలి



గ్రామ పంచాయతీలో పనిచేసే కారోబార్లకు పంచాయతీ పాలకవర్గంపై ఆధారపడకుండా ప్రస్తుతం కొత్త ప్రభుత్వం వారికి బ్యాంకుల ద్వారా వేతనాలు చెల్లించాలి. చిన్న గ్రామ పంచాయతీ, పెద్ద పంచాయతీల వరకు ఇంటి పన్నులు, నీటి పన్నులు సరైన సమయంలో వసూలు కాకపోవడంతో కరోబార్లకు వేతనాలు పంచాయతీ పాలకవర్గాలు చెల్లించడం లేదు. దీంతో వారి కుటుంబాలు భారంగా కొనసాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం వారికి తక్షణమే బ్యాంకుల ద్వారా వేతనాలు చెల్లించేలా చూడాలి.

- జిల్లా సిఐటీయు నాయకులు నన్నేసాబ్

కేరళ ప్రభుత్వంపై కేంద్రం నిరంకుశ ధోరణి

- సీఐటీయూ, ప్రజాసంఘాలు సంఘీభావం
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తుందని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రమేష్‌బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆరోపించారు. గురువారం సిఐటియు కేంద్ర కమిటీ పిలుపుమేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా చౌక్ వద్దా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎ.రమేష్‌బాబు, నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్రం వివక్షపూరిత విధానాలు రాష్ట్రాల హక్కులపై దాడులకు వ్యతిరేకంగా సిఐటియు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, ప్రజాసంఘాలు కేరళ ప్రభుత్వానికి సంఘీభావంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. కేరళ ప్రభుత్వంపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ అణిచివేత ధోరణి అవలంబిస్తుందని అన్నారు. కేరళలో విపత్తులు, కష్టకాలంలో కూడా సహాయం చేయకుండా కేంద్రం మొండిచేయి చూపిందన్నారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అన్ని విధాలా ఆటంకాలు కలిగిస్తూ అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు. కేరళ ప్రభుత్వం ఆదాయం ఉత్పత్తిలో ముందంజలో ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ విధానాల వలన సంక్షోభం ఏర్పడిందన్నారు. 2021-22లో కేరళ రుణ పరిమితి తగ్గించిందని అన్నారు. జీఎస్టీ వంటి ఆదాయ వనరును తగ్గించిందని అన్నారు. ప్రతిపక్ష నేతలపై ఈడి, సిబిఐ, ఇన్కమ్‌టాక్స్ డిపార్ట్మెంట్లను ఉపయోగించడం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశాలలో కేంద్రం జోక్యం చేసుకొని దుర్వినియోగం చేయడం, ప్రభుత్వ వ్యవహారాలలో గవర్నర్ జోక్యం చేసుకొని మితిమీరి వ్యవహరించడం, ప్రభుత్వ పని విధానంపై ప్రభావం పడుతుందని అన్నారు. విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం విద్వేశ పూరిత వైఖరి అవలంబించడం సరికాదని ఇది మేధావులు, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కేరళ ప్రభుత్వానికి ప్రజలకు ప్రజాసంఘాలు సంఘీభావంగా ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ, సిఐటియు జిల్లా కోశాధికారి పి.స్వర్ణ, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విగ్నేష్, బోడ అనిల్, జిల్లా కార్యదర్శి సుజాత, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, కృష్ణ, భాస్కర్, అబ్దుల్ ముజీబ్, అర్జువాలి, అంజన్న, రాజన్న, రవి, వినోద్, కళావతి, వండరి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు దీపిక తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా వేయాలని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-మద్నూర్


పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్యాయత్నం చేస్తున్న వ్యక్తి

వేలంపాట వాయిదా వేయాలని వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చోటుచేసుకుంది. గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజా సామాగ్రి విక్రయించేందుకు గానూ వేలంపాట వేసేందుకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేలంపాటలో పాల్గొనే భక్తులు ముందుగా కొందరు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు రాతపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. ఆలయ ఆవరణలో సామాగ్రి అమ్మడానికి వేలంపాట నిర్వహించినా.. ఆలయం బయట టెంకాయలు కానీ ఇతర సామాగ్రి అమ్ముకోవడానికి అనుమతిస్తే బాగుంటుందని ఉపాధి లేక ఎందరో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రస్తుతం వేలంపాట వాయిదా వేసి సమస్య పరిష్కారం అనంతరం మళ్లీ వేలంపాట వేస్తే బాగుంటుందని కొంతమంది భక్తులు వేలంపాటలో విన్నవించారు. అయితే వేలంపాటలో పాల్గొనేందుకు పదివేల చొప్పున డిపాజిట్ చేసిన పలువురు వేలంపాటను వాయిదా ఎలా వేస్తారని చెప్పడంతో ఇరువర్గాల మధ్య కొంత గొడవ చోటుచేసుకుంది. దీంతో ఓ వ్యక్తి వేలంపాట వాయిదా వేయకుంటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆలయ ఆవరణలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో అక్కడున్న వారు ఆయన్ను అడ్డుకున్నారు.

పెద్ద జొన్న పంటకు తెగుళ్లు


తెగుళ్లు సోకిన పెద్దజొన్న పంట

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో తెల్ల పెద్ద జొన్న పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. తెల్ల జొన్న పంట మంచిగా ఏపుగా పెరిగిందని, దిగుబడి బాగుంటుందని ఆశించినా.. కంకిలోపల పురుగుల బెడదతో కంకి ఎండిపోయిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎన్నో రకాల రసాయన మందులను పిచికారీ చేసినా తెగుళ్ల బెడద తగ్గుముఖం పట్టడం లేదని అంటున్నారు. వ్యవసాయాధికారులు ఇటీవలే క్షేత్రస్థాయిలో పరిశీలించారని, వారి సూచన మేరకు మందులను పంటకు స్ప్రే చేశామని వారు పేర్కొన్నారు.

వీడీసీ అక్రమ కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తాం

- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వీడీసీ అక్రమ కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పాటు మండలాలలో, గ్రామాభివృద్ధి కమిటీల చట్టవ్యతిరేక కార్యకలాపాలపై గల కేసులు అరెస్టు అయిన వారి వివరాలు గురువారం తెలియజేశారు. 2022 సంవత్సరంలో 12 కేసులు, 119 మంది అరెస్ట్, 2023 సంవత్సరంలో 11 కేసులు 163 మంది అరెస్ట్, 2024లో 05 కేసులు 75 మందిని అరెస్ట్ చేసినట్టు వివరించారు. నిజామాబాద్ జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీలు గత 15 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో గ్రామాలలో జరిగే సివిల్ తగాదాలు, భూ తగాదాలు, వివాహసంబంధ తగాదాలు, అన్నదమ్ముల పంచాయితీలు, భార్యభర్తల వివాదాలలో తలదూర్చీ, పంచాయితీలలో దడవాతు (అడ్వాన్సు) తీసుకొని వారికి నచ్చిన విధంగా తీర్మానించి, చట్టం చేయవలసిన పనిని వారి చేతులోనికి తీసుకుని, వాళ్ళను పోలీస్‌స్టేషన్‌ను, న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా గ్రామస్తులు తాము చెప్పినవిధంగా విననియెడల పెద్దమొత్తంలో దండుగా (జరిమానా) వేసి వారి మాట వినని వారిని ఆ గ్రామం నుంచి వెలివేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో గ్రామంలో బెల్టు షాపులు, కూల్డ్రింక్ షాపులు, కిరాణ షాపు, కోడిగుడ్డు ధరపై యాక్షన్ (వేలం వేయడం) వేయడంలో ఎవరు ఎక్కువధర చెల్లిస్తారో ఆ వ్యక్తి మాత్రమే ఆ గ్రామంలో ఆ వస్తువులను అమ్మేటట్లు నియమంగా పెట్టి డబ్బులు వసూళ్ళ చేస్తున్నారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఏ వృత్తియైన చేపట్టే ప్రాథమిక హక్కును ప్రతీ భారత పౌరునికి కల్పించిందని తెలిపారు. అలాగే పిసిఆర్ యాక్ట్ 1955 (పౌర హక్కుల చట్టం 1955) ప్రకారంగా అనుసరించి పౌరుల కులం, మతంపరంగా కాని లేదా మరి ఏ విధంగానైనా కాని పౌరుల మధ్యన పక్షపాతధోరని, పౌరులను వర్గ కులపరంగా బహిష్కరించవద్దని సూచించారు.

ఉపాధి కూలీలపై శ్రమ దోపిడీ

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు

నవతెలంగాణ-వర్ని

ఉపాధి పని క్షేత్రాల్లో శ్రమదోపిడీని అరికట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మోస్రా మండల కేంద్రంలో ఉపాధి పని క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల వద్ద అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒక్కొక్క కూలికి రెండు మీటర్లు పొడవు, ఒక అడుగు లోతు పెట్టాలి కానీ, మూడు మీటర్ల పొడవు ఒక ఫీట్ లోతు కొలతలను చూపిస్తూ యథేచ్ఛగా ఉపాధి కూలీల శ్రమను దోపిడీ చేస్తున్న వైనం కనిపించిందన్నారు. సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడగా అనేక వంకలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని, భూమి కూడా గట్టిపడిందని, ఈ నేపథ్యంలో గడ్డపార కూడా భూమిలోకి దిగటం లేదని, స్వయంగా తానే తవ్వి చూసినట్టు వివరించారు. రెండు మీటర్ల పొడవు, ఒక ఫీట్ లోతు వరకు మాత్రమే తవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి కూలీలు ఎంతో శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి పనిచేసే వారికి ఎలాంటి నైపుణ్యం లేని వారికి కూడా పూర్తిస్థాయి వేతనం ఇవ్వాలని ఉన్నప్పటికీ ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించి ఉపాధి కూలీలను దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం లక్ష్యాలను నెరవేర్చకపోగా అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నదని అనేకసార్లు రుజువైందని అన్నారు. ఇప్పటికే దేశంలో ఒక కోటి జాబ్ కార్డులను రద్దు చేసిందని, ఇంకా అనేక ఆంక్షలు పెట్టి ఉపాధి హామీ పనికి ఉపాధి కూలీలను దూరం చేసే కుట్ర కేంద్ర ప్రభుత్వం పన్నుతుందని అన్నారు. రోజు వేతనం రూ.600 చెల్లించి, 200 పని దినాలు కల్పించాలని ఎప్పటినుంచో ఉన్న డిమాండ్‌ని అమలు చేయాలని, పలు సమస్యలని పరిష్కరించుకోవడం కోసం శనివారం 10 తేదీన ఉదయం 11 గంటలకు మోస్రా ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఉపాధి కూలీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు, మండల బాధ్యులు మల్లేష్ యాదవ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.


కూలీలతో కలిసి పనిచేస్తున్న వ్యకాస జిల్లా కార్యదర్శి పెద్దివెంకట్రాములు

బస్సుల్లో రద్దీ

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బస్సుల ప్రయాణికుల రద్దీ నెలకొంది. బస్సుల్లో భారీగా జనాలు ఎక్కడంతో కొంత సమస్యలు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేయడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీంతో బస్సుల్లో రద్దీ నెలకొంటుంది. ఇదిలా ఉండగా.. బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరగడంతో కొందరు నిలబడి ప్రయాణం చేసే దుస్థితి నెలకొంది.



జిల్లాలో ముమ్మరంగా ఎల్‌పిజి సర్వే

- నిర్ధారిత యాప్‌లో పొందుపరచాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



జిల్లాలో ఎల్పిజి సర్వే ముమ్మరంగా కొనసాగుతుందని, ప్రజాపాలన సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తులలో గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వివరాలను వెంటనే సేకరించి నిర్ధారిత యాప్‌లో పొందుపరచవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సర్వే బృందాలను ఆదేశించారు. గురువారం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఏర్పాటు చేసిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అభయహస్తం కింద ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఒకటైన 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే పథకం త్వరలో అమలు చేయాలని యోచిస్తున్న నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించగా సరైన వివరాలు పేర్కొనలేదని గమనించి తిరిగి అట్టి వివరాలు సేకరించవలసినదిగా ఆదేశించినట్లు తెలిపారు. ప్రధానంగా దరఖాస్తులో గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నెంబర్, రేషన్‌కార్డు నెంబర్ వంటి వివరాలను ప్రజలు సరిగా పొందుపర్చలేదని అన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరిచెయుటకు ప్రత్యేక యాప్‌ను రూపొందించిందని తెలిపారు. తప్పిదాలను సరిచేయుటకు ఏర్పాటు చేసిన గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయి బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సర్వే బృందాలు ఈ నెల 10లోగా తప్పిదాలు నమోదు చేసిన దరఖాస్తుదారులను సంప్రదించి సమగ్ర వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేసేలా పర్యవేక్షించవలసినదిగా ఎంపిడిఓలు, ఎంపీఓలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా సర్వే బృందాలకు సహకరించవలసినదిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులు సక్రమంగా ఉన్న వాటికి సంబంధించి వాటి ఆమోదం నిమిత్తం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, సర్వే బృందాలు తమను సంప్రదించలేదని ఇతర దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

బడికి వెళ్లమన్నందుకు విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి



బడికి వెళ్లాలని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోదండం భారతి (15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతుంది. తండ్రి సాంబాకు ముగ్గురు భార్యలు, మొదటి భార్య కూతురు భారతి. ఉదయం 8 గంటలకు బడికి వెళ్లాలని భారతిని మందలించాడు. అనంతరం భార్యతో కలిసి సాంబ ఉప్పల్‌వాయి గ్రామానికి కూలి పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 1:30 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి, ఇంట్లో ఫ్యాన్‌కు భారతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉంది. తండ్రి సాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కార్మికుల ప్రతిఘటన దినోత్సవం విజయవంతం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కార్మికుల ప్రతిఘటన దినోత్సవం సందర్భంగా భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) నాయకులు గురువారం హైదరాబాద్ తరలివెళ్లారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వరదయ్య, సాయిలు మాట్లాడుతూ.. శ్రామిక ప్రజలపై స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులు కార్పోరేట్ వర్గాలు సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా నిరంతరం సమరశీల నిర్ణయాత్మక పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తుందని తెలిపారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దుచేసి ఆశ వర్కర్, అంగన్‌వాడీ టీచర్స్ కార్మిక చట్టాల ప్రకారం.. రక్షణ కల్పించి వారికి గౌరవప్రదమైన వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని అన్నారు. నాయకులు శివరాజ్, దుడ్డుగంగాధర్, అల్తాఫ్, సురేష్, వినోద్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సర్పల్లి తాండ గ్రామ సభ్యులు

నవతెలంగాణ-సిరికొండ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

మండలంలోని సర్పల్లి తాండ గ్రామ సభ్యులు రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని ఎస్టి సెల్ జిల్లా నాయకులు సంతోష్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తండా అభివృద్ధికి పనులు మంజూరు చేయాలని కోరడంతో వెంటనే ఎమ్మెల్యే భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చందర్ నాయక్, మండల నాయకులు శివాజీ, మోజీరామ్, మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ఆసిఫ్, రాజేశ్వర్ గౌడ్, లింగం, తండా నాయకులు బన్నాజీ నాయక్, లింబా నాయక్, సక్రమ్, రాజేందర్, జగమల్, కైలాష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిన హైర్ బస్ డ్రైవర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐటియూసి నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో వివిధ డిపోలకు సంబంధించిన హైర్ బస్ డ్రైవర్లు ఏఐటీయూసీలో చేరారు. వీరికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, అధ్యక్షులు పి.నర్సింగరావు నాయకులు హనుమాన్లు, అనిల్, చక్రపాణి, సాయిలు, సంపత్ లు కార్మికులకు కండువాలు వేసి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ యాజమాన్య సంస్థ అయిన ఆర్టీసీలో హైర్ బస్ డ్రైవర్లు అడ్డాకూలీల కంటే అధ్వానంగా పనిచేస్తున్నారని అన్నారు. ఎలాంటి హక్కులు లేకుండా, కనీస వేతనాలు అమలు గాకుండా, పిఎఫ్, ఈఎస్ఐ ఇన్సూరెన్స్ లాంటి చట్టాలు అమలు కాకుండా అధ్వానమైన పరిస్థితుల్లో ప్రభుత్వ యాజమాన్య సంస్థలో కార్మికులు పనిచేయడం మార్గం అని తెలిపారు. హైర్ బస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆర్టీసీ ఉద్యోగులవలే వీరికి కూడా ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని గ్రాట్యుటి అమలు చేయాలని, గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీలో చేరిన వారిలో హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి శివ కేశవ్, కోశాధికారి నవీన్ నాయకులు గంగాధర్, అనిల్ ,నరసయ్య, సిహెచ్ గంగాధర్, ప్రశాంత్, రాజేందర్, యాకూబ్ కార్మికులు తదితరులు చేశారు.

ఆల్ఫోర్స్ గుర్తింపు రద్దు చేయాలి

పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆర్మూర్‌లో ఎనిమిది నెలలుగా ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్న ఆల్ఫోర్స్ హైస్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారి నాగజ్యోతికి గురువారం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న నరేంద్ర హైస్కూల్ గుర్తింపును అద్దెకు తీసుకొని అనుమతి లేకుండా ఎనిమిది నెలలుగా ఆల్ఫోర్స్ హైస్కూలు పేరుతో నడుపుతున్నారని అన్నారు. పుస్తకాలు, యూనిఫామ్స్ స్కూల్స్ పరిసరాలు ఆల్ఫోర్స్ పేరుతో నడుపుతున్నారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో కార్పొరేట్ హైస్కూల్ అనే పేరుతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఆల్ఫోర్స్ పేరుతో అడ్మిషన్స్ చేయించుకొని నరేంద్ర హై స్కూల్ పేరుతో బోనఫైడ్స్ అందిస్తున్నారని తెలిపారు. ఎనిమిది నెలలుగా మండల జిల్లా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కావున ఆల్ఫోర్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నరేంద్ర హైస్కూల్ ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని మొదట హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా నాయకులు వంశీ, మనోజ్, నగర నాయకులు ఆకాష్,గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతలూరులో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున విద్యార్థులూ అలసిపోకుండా విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం పౌష్టిక ఆహారాన్ని స్నాక్ (అల్పాహారం) అందించడానికి చింతలూర్ గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ బ్రహ్మణపల్లి జలంధర్ ముందుకు వచ్చారు. తన చేతుల మీదుగా విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా జలంధర్‌ను ప్రధానోపాధ్యాయులు లచ్చన్న, ఉపాధ్యాయులు పత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిఆర్‌టియు టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంట అశోక్, నర్సయ్య, రాజేందర్, బాలకృష్ణ ప్రసాద్, గంగారాం, జయలక్ష్మి రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసీఓని కలిసిన వైఎస్ శేఖర్‌రెడ్డి



డిసీఓను సన్మానిస్తున్న వైఎస్ శేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నిజామాబాద్ అర్బన్ చైర్మన్ వైఎస్ శేఖర్ రెడ్డి గురువారం జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ గురువారం నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యులు చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారీ గోపికృష్ణ మాట్లాడుతూ సర్జరీ అవసరం ఉన్న వ్యాధిగ్రస్తులు హైదరాబాద్ లోని తమ ఆసుపత్రిలో లో తక్కువ ఖర్చుతో సర్జరీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు లింగాగౌడ్ మేముల, సునీత, ఉదయ్ పిలాని, బసంత్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, సంధ్య, శిరీష, సుష్మ, కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ శశిధర్, శ్రీనివాస్ రవికుమార్, లక్ష్మీ కాంతం, పురెందర్, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఏవో నర్సారెడ్డి సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం

రద్దు చేయాలి

- కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలి
- 16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం



సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ విధానం రద్దు చేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపు నిచ్చారు. నిజామాబాద్ అర్బన్ లో మున్సిపల్ జోన్ వన్, జూన్ ఫోర్‌బిలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ పోస్టర్ ఆవిష్కరణ, జోన్ వన్ జోన్ ఫోర్ బి లో సంతకాల సేకరణ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు లు మాట్లాడుతూ... కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలైనా రైతాంగ, కార్మికవర్గ, ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. అనేక మోసపూరిత నినాదాలతో కాలం వెళ్ళదీసింది. అధికారంలోకి వస్తే ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ అమలుకే నోచుకోలేదని తెలిపారు. కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించక పోవడంతో మున్సిపల్ కార్మికులు ఆర్థిక ఇబ్బంది లకు గురౌతున్నారని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సో ర్సింగ్ పద్ధతులలో కార్మికుల్ని నియమిస్తే వారికి పీఎఫ్ఎస్ఐ కనీస వేతనాలు ఇతర సౌకర్యాలు అమలు చేయాలని యూనియన్లు డిమాండ్ చేస్తాయని ఆలోచనలో నర్సరీలు పార్కులు ట్యాంకు బండ్స్ వైకుంఠధామం హౌస్ కీపింగ్ ఇతరుల డైలీ వైస్ కార్మికుల్ని నియమిస్తూ వారికి అన్యాయం చేస్తుందన్నారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూపతి, చంద్ర సింహం, సంతోషింగ్ అంజయ్య చంద్రయ్య శేఖర్ జి లక్ష్మి కే లక్ష్మి అవినాష్, ఏక్ నాథ్, గుండాస్వామి, ఆశా బాయ్, తదితరులు పాల్గొన్నారు.

16న సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కేంద్ర బిజెపి కార్పొరేట్ మతతత్వ విధానాలకు, వైఫల్యాలకు నిరసనగా 2024 ఫిబ్రవరి 16న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె గ్రామీణ బందును జయప్రదం చేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు ప్రజలను కోరారు. ఫిబ్రవరి 8న కోటగల్లిలోని ఎన్ఆర్ భవన్‌లో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య దాసులు మాట్లాడుతూ.. మోడీ సర్కార్ 10 సంవత్సరాల పాలనలో ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా దేశాన్ని అప్పులకుప్పగా మార్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను మోడీ తెచ్చి రైతుల భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే కుట్ర చేయగా రైతుల ప్రతిఘటనతో వెనక్కి తగ్గారని వారు తెలిపారు. ప్రపంచంలోని 125 దేశాల్లో భారత్ ఆకలిలో 11వ స్థానంలో ఉందని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా, రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, రామాలయ నిర్మాణం పేరుతో ప్రజల్ని వక్రమార్గం పట్టించే కుట్ర చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ పేర్కొన్న ప్రకారం పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టం తీసుకురావాలని, విద్యుత్ రంగ ప్రవేటీకరణ నిలుపుదల చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి సర్కార్ కార్మిక రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలకు మతతత్వ ధోరణులకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని భూమన్న, దాసులు కోరారు. సమావేశంలో ఏఐకెఎమ్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి జిల్లా నాయకులు దేవ స్వామి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, ఆర్ బాబురావు, దేవన్న, భూమన్న, నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు పెన్షనర్ల మద్దతు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈనెల 16న జరగనున్న సార్వత్రిక సమ్మెలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొంటామని ప్రకటించింది. ముఖ్యంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పెన్షనర్లకు ఇన్కమ్ టాక్స్ నుండి మినహాయింపు ఇవ్వాలని, ధరల పెరుగుదలను అరికట్టాలని, ప్రభుత్వ రంగ సంస్థలన ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని, రైతాంగానికి కనీస మద్దతు ధర కల్పించాలని అన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్లతో జరగనున్న ఈ సమ్మెను ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని తెలిపారు. గురువారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు శిర్ప హనుమాన్లు, జిల్లా కార్యదర్శి మదన్మోహన్, కోశాధికారి ఈవీఎల్ నారాయణ, జిల్లా నాయకులు ప్రసాద్ రాధాకృష్ణ స్వరూప రాణి, బేబీరాణి. బన్సిలల్ , లావు వీరయ్య పురుషోత్తం, పుష్పవల్లి, బట్టి గంగాధర్ , రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సతీ సమేతంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. ఈనెల 18వ తేదీన జెన్ వి కన్వెన్షన్ హాల్, కొంపల్లి, హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని వివాహ పత్రిక ఇచ్చి ఆహ్వానించారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి దీపాదాస్‌మున్షిని సైతం భూపతి రెడ్డి దంపతులు కలిసి వివాహానికి రావలసిందిగా ఆహ్వానించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- ప్రత్యేక అధికారి మైలారం గంగాధర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్, ప్రత్యేక అధికారి మైలారం గంగాధర్ అన్నారు. గురువారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రత్యేకాధికారి గంగాధర్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ఆవరణ, పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి, ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, ఎంపీటీసీ సభ్యురాలు తోట జ్యోతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్ గారు,అంగన్వాడీ టీచర్లు, విఓఏ లు, ఆశ వర్కర్లు, మహిళ సంఘ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఈవీఎంల ఎఫ్ఎల్‌సి ప్రక్రియ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) ప్రక్రియ కొనసాగుతోంది. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎఫ్ఎల్‌సి ప్రక్రియను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వి.విప్యాట్ల పనితీరు పరిశీలన కోసం ఈసీఐఎల్ ఇంజినీర్లు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సి ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా ఎఫ్ఎల్‌సీ పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఎన్నికల విభాగం అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

సిపిఆర్‌పై అవగాహన



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసిపి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పీఎస్ సిబ్బందికి సీపీఆర్ (సీపీఆర్ ఎలా నిర్వహించాలి అని) సిస్టమ్ గురించి అవగాహన కార్యక్రమం గురువారం నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ, ట్రాఫిక్ సిఐ చంద్రరావు సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బందికి సిపిఆర్‌పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తారని ట్రాఫిక్ ఏసిపి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ ట్రాఫిక్ నారాయణ, ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్ తో పాటు, నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పాల్గొని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు వాటిపై అవగాహన కల్పించారు. దీనికి సహకరించిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోతంగల్‌లో పల్లెకి పోదాం చలో కార్యక్రమం

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని పోతంగల్ గ్రామంలో పల్లెకి పోదాం చలో కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేవైఎం మండల కన్వీనర్ బండారి రాజశేఖర్ ప్రభారిగా వెళ్లి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో దోమలతో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారని ప్రజలు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆటస్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, పిఎం కిసాన్, విశ్వకర్మ, గరీబ్ కళ్యాణ్, డిజిటల్ సేవలు, జన్ ధన్ యోజన పథకాలపై ప్రజలతో చర్చించి వివరించారు. కార్యక్రమంలో బిజెపి మండల కార్యదర్శి బందెల ఆనంద్, బూత్ అధ్యక్షులు కల్లోల రాజేందర్, శ్రీను, ఋషి పండిత్, నరేందర్, అఖిలేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

పిల్లలను అప్రమత్తంగా ఉండాలని జిల్లాలో వరుసగా జరుగుతున్న కిడ్నాప్ ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయని, గడిచిన వారం రోజుల్లో ముగ్గురు చిన్నారుల కిడ్నాప్ సంఘటనలు భయాందోళనలకు గురి చేస్తుందని ఎస్.ఎస్.యు.ఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్ అన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఎన్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమాన్ మాట్లాడుతూ. పిల్లలను కిడ్నాపర్ల బారి నుండి కాపాడేందుకు తల్లిదండ్రులతో పాటు పాఠశాల యజమాన్యం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు బయట వెళ్లి ఆడుకునే సమయంలో అపరిచితులతో మాట్లాడవద్దని అపరిచితులు ఇచ్చిన తిను చాక్లెట్లు బిస్కెట్లు తినకూడదని సూచించాలని అన్నారు. చిన్నారులకు ఉపాధ్యాయులు కిడ్నాప్‌లకు సంబంధించిన విషయాల పట్ల అవగాహన కల్పించాలని ఆయన కోరారు. పాఠశాలకు వచ్చే చిన్నారులను ఉపాధ్యాయులు ఎల్లవేళలా పర్యవేక్షిస్తూ ఉండాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లలను వారి తల్లిదండ్రులతో కాకుండా వేరే ఇతర వ్యక్తులకు ఇచ్చి పంపకూడదని తెలిపారు. పాఠశాల చుట్టుపక్కల ఎవరైనా అపరిచితులు అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బాల్కొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మొండి దినేష్, ఎన్ఎస్‌యుఐ నాయకులు అభి, మహేశ్వర్, సంపత్, విష్ణు, సాయి, రాజు, శ్రీకాంత్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మహేష్


చదువు క్రమశిక్షణనే

విజయానికి సోపానాలు

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు లాబిశెట్టి మహేష్

నవతెలంగాణ-సిరికొండ

జీవితంలో ఆటుపోట్లు సహజమని గెలుపోటములు తట్టుకోవాలని, ప్రపంచానికి మనల్ని పరిచయం చేసేది మన చదువుఅని, క్రమశిక్షణ విజయానికి సోపానాలని ప్రఖ్యాత వ్యక్తిత్వ నిపుణులు లాఖిశెట్టి మహేష్ అన్నారు. గురువారం సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన విజయీభవ లి' ది టానిక్ టాక్ ఫర్ ఫ్లైయింగ్ వింగ్స్' ప్రేరణ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అధ్యక్షత వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు లాఖిశెట్టి మహేష్, విజ్ఞా మహేందర్, సలవడి వెంకటేశు అతిథులుగా వచ్చారు . ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కుటుంబ పరిస్థితులకు, వ్యక్తిగత సమస్యలను క్రోడీకరించి ఆటంకం కలగకుండా ఏ స్థాయికి చేరామనేది సమాజానికి పరిచయం చేస్తే అది నీ విజయం అని అన్నారు. విజ్ఞా మహేందర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని ఉపాధ్యాయుల ఆశలను గుర్తించి విద్యార్థి దశ నుండే సాధన చేసి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జీవితం అనేది అందమైన పూలవనం లాంటిదని, దానిని మలచుకోవడంలో ప్రతి ఒక్కరు తోటమాలిని పాత్రను పోషించాలని అన్నారు. అంతర్లీనంగా నిగూఢమైన ప్రతిభ, శక్తిని గుర్తించి కఠోరసాధన చేస్తే అసాధ్యాలు సుసాధ్యాలు అవుతాయన్నారు. జీవితంలో గొప్ప గొప్ప విజయాలు సాధించినవారి జీవిత ఇతిహాసాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పయనించాలన్నారు. సలవడి వెంకటేష్ మాట్లాడుతూ మంచివైపు ఎదుగుదలవైపు ఎవరు ప్రోత్సహిస్తున్నారో గుర్తించి వారితో స్నేహం చేయాలన్నారు. చిన్నతనం నుండే సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని, మార్పు అనేది ప్రతి ఒక్కరిలో రావాలని ప్రపంచాన్ని మార్చే శక్తి అత్యంత శక్తి వనరులైన యువత, విద్యార్థులేనన్నారు. ఓటమిని విజయానికి బాటలుగా మలుచుకొని భవిష్యత్తులో ఇతరులకు మార్గదర్శకంగా ఉండే స్థాయికి చేరుకోవాలని అన్నారు. పదవతరగతిలో మంచి ఫలితాలు సాధించి కన్న తల్లిదండ్రుల కళ్ళలో కాంతులు చూడాలన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్, గైడ్స్ సెక్రటరీ సాల్మన్, ఉ పాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



టెస్టులు నిర్వహిస్తున్న దృశ్యం

గుడిసెవాసులకు వైద్యపరీక్షలు

ఉచితంగా మందులు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

దుబ్బ బైపాస్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న భూ పోరాటం వద్ద స్వచ్ఛందంగా గవర్నమెంట్ సిబ్బంది వచ్చి ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో నిరుపేదలకు గురువారం ఉచితంగా టెస్టులు చేసి మెడిసిన్ కూడా అందజేశారు. సిబ్బంది లాస్య మౌనిక, శ్రీకాంత్, వరలక్ష్మి, మహి, తదితరులు కలిసి క్యాంపులో పేదలకు పరీక్షలు చేశారు. వారికి ఐద్వా మహిళా సంఘం తరపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేకమైన క్యాంపు పెట్టాలని వారిని కోరారు. మళ్ళీ ప్రత్యేకమైన క్యాంపు ఏర్పాటు చేస్తామని టిఐ ప్రాజెక్ట్ మేనేజర్ మోహిమ్ హామీ ఇచ్చారని తెలిపారు.

నవతెలంగాణ 3
కామారెడ్డి
శుక్రవారం | ఫిబ్రవరి 09, 2024 | www.navatelangana.com

పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేత



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నందున వారికి సాయంత్రం వేళ అల్పాహారం అందించడానికి 'మేము నీకోసం' వ్యవస్థాపకులు రఘుపతి లక్ష్మన్, సభ్యులు పల్లె మహేష్‌లు ముందుకు వచ్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్‌రావు తెలిపారు. మార్చి 18 వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను పురస్కరించుకొని సాయంత్రం వేళలో వారికి అల్పాహారాన్ని అందించడానికి ముందుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఆర్‌టిఓ మండలాధ్యక్షులు టి.సోమలింగంగౌడ్, ఉపాధ్యాయులు బి.వెంకటలక్ష్మి, పరమేశ్వర్, ప్రభాకర్, సాయన్న, రాజేశ్వర్, రాధ, శ్రీనివాస్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్య పదజాలంపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

బాన్సువాడలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో డిసిసిబి చైర్మన్ భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిపై అసభ్య పదజాలం ఉపయోగించి మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా డెలిగేట్ సభ్యులు ఎంపీటీసీ కోట మనోహర్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రోటోకాల్ గురించి వివరించడం ఆశ్చర్యకరంగా ఉందని, ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాధర దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి కామ్రేడ్
తాండ్రకుమార్ ద్వితీయ వర్ధంతి

- రాష్ట్ర సదస్సును జయప్రదం చేయలి
- యంసీపిఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు జబ్బర్‌నాయక్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఫిబ్రవరి 14న అమరజీవి కామ్రేడ్ తాండ్ర కుమార్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా చేపట్టే ర్యాలీ, రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు జబ్బర్‌నాయక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక గెస్ట్‌హౌస్‌లో జరిగిన యంసిపిఐ (యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తాండ్ర కుమార్ రెండవ వర్ధంతికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జబ్బర్ నాయక్ మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలకు ఆశాజ్యోతి బహుజనుల బంధువు, పేదల పెన్నిధి తాండ్రకుమార్ అని అన్నారు.. కామ్రేడ్ తాండ్ర కుమార్ ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, సుజాత, లీల, భార్గవి, జంగయ్య, బాలరాజు, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

చెరువులు ఖాళీ అయితే
సాగునీరెట్లా..?

- తూముల నుంచి ఇష్టానుసారంగా నీటి విడుదల
- పలుచోట్ల వృథాగా పోతున్న నీరు
- చెరువు ఆయకట్టు కింది రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-నిజాంసాగర్

యాసంగి పంటలు చేతికిరాకముందే చెరువులు ఖాళీ అవుతున్నాయి. కొందరు ఇష్టానుసారంగా చెరువుల్లోని నీటిని విడుదల చేయడంతో వృథా అవుతున్నాయి. తద్వారా చెరువులు ఎండిపోతున్నాయి. గతంలో చెరువులపై వీఆర్ఏల పర్యవేక్షణ ఉండేది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల వ్యవస్థను ఎత్తివేసింది. వారిని ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేయడంతో చెరువులను పర్యవేక్షించేవారే లేకుండా పోయారు.

మండల వ్యాప్తంగా 62 చెరువులున్నాయి. ఈ చెరువులపై ఆధారపడి మొత్తం 15,290 ఎకరాలలో వరి పంటను సాగుచేశారు. ఇదిలా ఉండగా.. చెరువుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి పూర్తిగా ఎండిపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం చెరువులను ఏ అధికారీ కూడా పట్టించుకోకపోవడమనేది స్పష్టంగా తెలుస్తోంది. గతంలో ప్రతి గ్రామంలో యాసంగి పంట సాగులో భాగంగా అధికారులు గ్రామాలకు వెళ్లి.. చెరువుల్లో నీటి సామర్థ్యాన్ని బట్టి ఆ చెరువు కింద ఎంత పంట సాగుచేయాలో నిర్ణయించేవారు. ఆ విషయాన్ని అధికారులు రైతులకు సూచించేవారు. అలాగే ఆ పంట సాగుకోసం సంబంధించిన నీటిని నీటి వదిలే బాధ్యతలను వీఆర్ఏలకు అప్పజెప్పేవారు. దీని ద్వారా గ్రామాలలోని వీఆర్ఏలు పంట సాగుకు అవసరమయ్యే విధంగా నీటిని వదిలేవారు. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. వీఆర్ఏలను గత ప్రభుత్వం వివిధ శాఖలకు బదిలీ చేయడం వలన చెరువులపై పూర్తి అధికారం ప్రజలపై పడింది. దీనివలన ప్రజలు ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు నీటిని విడుదల చేయడం వలన చెరువులలోని నీరు మొత్తం వృథాగా పోతుంది. ఇంత జరుగుతున్నా కనీసం నీటిపారుదల శాఖ అధికారులు చెరువుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. జనవరి నెలలోనే చెరువుల్లోని నీరు మొత్తం ఖాళీ అవుతోంది. ఇది ఇలానే కొనసాగితే పంట సాగుకు భారీ నీటి సమస్యలు తలెత్తే అవకాశముంది.

కొందరు రైతులు చెరువులపైనే ఆధారపడి యాసంగి పంటను సాగు చేస్తున్నారు. అయితే కొన్ని చెరువుల తూముల నుంచి నీరు వృథాగా పోవడం వలన పంట పూర్తయ్యే వరకు నీరు ఉంటుందో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇలానే కొనసాగితే పంటలు ఎండుముఖం పట్టే అవకాశముందని మండలంలోని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. కొన్ని గ్రామాలలో చెరువు భూమి సైతం కబ్జాకు గురవుతుందని ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే చెరువుల్లో నీరు ఉండేలా.. చెరువులపై పర్యవేక్షణ చేపట్టాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

జాప్తి జానకంపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలించిన ఎంపీపీ



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని జప్తి జానకంపల్లి గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఎంపీపీ రాజదాసు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గ్రామస్తులు దేవిసింగ్ తదితరులున్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

ఈనెల 13న నల్గొండలో జరగబోయే కేసీఆర్ మహాసభను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి తాజా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నల్గొండలో జరగబోయే మహా బహిరంగ సభ ఏర్పాట్లలో భాగంగా నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా పట్టణంలోని నియోజకవర్గ నాయకులతో సమావేశంలో పాల్గొన్న పార్టీ సమన్వయకర్త ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచంద్రునాయక్ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో బోయిన్‌పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, నాగార్జునసాగర్ నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ, ఆశల సమ్మె నోటీసు అందజేత



నవతెలంగాణ-వర్ని

ఫిబ్రవరి 16న కార్మిక సంఘాలు తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ, ఆశా ఉద్యోగులు పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో వర్ని తహసీల్దార్ నారాయణకు సమ్మె నోటీసును అందజేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా అంగన్‌వాడీ, ఆశా ఉద్యోగులందరూ పాల్గొంటారని నోటీసులో పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం మహిళా ఉద్యోగుల పట్ల మొండిగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నన్నేసాబ్, యూనియన్ నాయకులు మంగాదేవి, బాలమణి, అనురాధ, నాగమణి, సీతాదేవి, రాధ, పల్లవి తదితరులున్నారు.

రెంజల్ : మండల కేంద్రంతో పాటు, బాగేపల్లి, కూనేపల్లి గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా పాఠశాలల ఆవరణలను శుభ్రం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పరిసరాల పరిశుభ్రతలు అధికారులతో పాటు స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, రెంజల్ గ్రామ కార్యదర్శి రాఘవేంద్రరావు, బాగేపల్లి ప్రధానోపాధ్యాయులు నరేందర్, శేఖర్, రెంజల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు సరిత, అనురాధ, సపూర, అంగన్వాడీ సురేఖ, క్షేత్ర సహాయకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కృషి ఎనలేనిది

- కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేష్ దేశాయ్



పాలక వర్గాన్ని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పిట్లం

సర్పంచ్, పాలకవర్గం కృషి ఎనలేనిదని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ దేశాయ్ అన్నారు. గురువారం మండలంలోని కంబాపూర్ గ్రామపంచాయతీ భవన ఆవరణలో సర్పంచ్ కవితా పాటిల్, ఉప సర్పంచ్ భూమవ్వ, సెక్రటరీ తుకారం, వార్డు సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సర పాలనలో గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించారని ఆయన కొనియాడారు. రాబోవు రోజులలో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీర్ సంగొప్పదేశాయ్, రాజు పటేల్, హన్మండ్లు పటేల్, గైని శివరాం, చాకలి బాలయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం

- ఏనుగును తక్కువ అంచనా వెయ్యకు పోచారం
- కాంగ్రెస్ జిల్లా నాయకుడు నార్ల రత్నకుమార్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు రత్నకుమార్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని పోచారం కుటుంబ సభ్యులు తక్కువ అంచనా వేసుకుని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ గెలిచి తమ సత్తా చాటుతామని కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ జెడ్పిటిసి నార్ల రతన కుమార్ తెలిపారు. గురువారం బాన్సువాడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి క్యాంప్ ఆఫీసులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి నార్ల రతన కుమార్ మాట్లాడుతూ.. ఏనుగు రవీందర్‌రెడ్డిని బిచ్చగాడు అని డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సంబోధించడం సరికాదని, వెంటనే డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి వాడిన పదాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాన్సువాడ పట్టణంలో సరైన కాంగ్రెస్ పార్టీ నేత లేకపోవడం వల్లనే పోచారం కుటుంబ సభ్యుల ఆగడాలు మితిమీరిపోయాయని ఆయన ఆరోపించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సరైన నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి రావడంతో పోచారం కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేని పోతున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి ఎప్పుడు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానిస్తామన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్‌రెడ్డికి గౌరవం ఇస్తామన్నారు. కాంగ్రెస్‌కు ఇతర పార్టీల ఎమ్మెల్యేలపై గౌరవం ఉందని ఆ గౌరవాన్ని అందరూ పాటించాలన్నారు. పోచారం శ్రీనివాసరెడ్డి అభివృద్ధి అని చెప్పుకోవడం కాదని బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో అవినీతి చాలా జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు ఇవ్వకుండా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అందులో అనర్హులకు ఇచ్చారని, అలాగే బాన్సువాడ కలిగి చెరువులో అవినీతి జరిగిందని, నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదని అధికారులు సూచించినప్పటికీ బాన్సువాడ ఎమ్మెల్యే పెడచెవిన పెట్టారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను పక్కగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అన్వర్, షేక్ అఫ్రోజ్, వసీం హైమద్, ఎం.వెంకటరామిరెడ్డి, మాసాని శేఖర్‌రెడ్డి, నార్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక టిప్పర్ల పట్టివేత



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. బోర్గం గ్రామం మీదుగా తాడ్‌బిలోలి ఫకీరాబాద్ వైపు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తరుణంలో తమ సిబ్బందితో వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై వాహనంతో పాటు, యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజాంసాగర్

ఉమ్మడి మండలంలోని మహమ్మద్‌నగర్ తహసీల్దార్ ఆఫీస్‌లో తహసీల్దార్ క్రాంతికుమార్ చేతుల మీదుగా బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం ఇన్చార్జ్ మల్లయ్యగారి ఆకాష్ మాట్లాడుతూ.. తెలంగాణలో 60 శాతం మంది బీసీలు ఉన్నారని ఆయన తెలిపారు. 60 శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా గాని రాష్ట్ర బడ్జెట్‌లో గానీ తగిన అంతా రిజర్వేషన్ నిధులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల కోసం అన్నివేళలా ముందు ఉంటానని ఆయన హామీనిచ్చారు. బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోటరాజు, సతీష్, మంగ కాశీరాం, అనిల్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన స్వయంభు లింగేశ్వర దేవాలయం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోలిలింగాల గ్రామంలో మంజీరా నది ఒడ్డున గల స్వయంభు లింగేశ్వర దేవాలయం ముస్తాబైంది. శుక్రవారం మాఘ అమావాస్య సందర్భంగా దేవాలయం ముస్తాబైనట్లు మాజీ సర్పంచ్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టి సాధించిన జీపి ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్ మద్నూర్ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య వారోత్సవాలు లో భాగంగా పరిశుభ్రత పట్ల జీపి ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్ ప్రత్యేక దృష్టి సాదిస్తూ పంచాయతీ పరిధిలో పలు వాడల్లో అపరిశుభ్రత తొలగింపు పట్ల పిచ్చి మొక్కలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుల పనులను గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి డాక్టర్ బండివార్ విజయ్, సెక్రటరీ సందీప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం



నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ కౌన్సిలర్ కామేపల్లి సత్యం మాతృమూర్తి కామేపల్లి తులసమ్మ వృద్ధాప్యంతో గురువారం మృతిచెందారు. దాంతో ఆమె మరణానంతరం ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆసుపత్రికి దానం చేశారు.

నేడు ఏకచక్రేశ్వర ఆలయం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో వెలిసిన స్వయంభు ఏకచక్రేశ్వర ఆలయం 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూరు బుజ్జి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక పూజలు, హెూమం, మహాయజ్ఞంతో పాటు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఏకచక్రేశ్వర ఆలయ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

రామారెడ్డి పిహెచ్‌సిలో క్యాన్సర్ వైద్య శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి పిహెచ్సిలో క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు ఎన్ జయలత హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. క్యాన్సర్‌కు సంబంధించిన స్కానర్‌తో పాటు 12 మంది వైద్య బృందం ప్రత్యేక బస్సులో వచ్చి, క్యాన్సర్, గర్భాశయ, నోటి, రొమ్ము క్యాన్సర్ సంబంధించిన పరీక్షలను 110 మందికి నిర్వహించినట్లు తెలిపారు. వారికి ఎక్స్‌రే, వంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్, స్థానిక ఎంపీపీ దశరథ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు ఎన్.జయలత వైద్య బృందానికి మద్దికుంట, రామారెడ్డితో పాటు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంజే క్యాన్సర్ వైద్య నిపుణులు సౌమ్య, హరిశంకర్, జిల్లా ప్రభుత్వ క్యాన్సర్ అధికారి వైద్యులు శిరీష, శోభ, రామారెడ్డి, అన్నారం పిహెచ్సి వైద్యులు సురేష్, మానస, ఎంపీటీసీ రజిత రాజేందర్‌గౌడ్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు గ్రామీణ ప్రాంతాలు పుట్టినిల్లు



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

క్రీడలకు గ్రామీణ ప్రాంతాలు పుట్టిన ఇల్లని, గతంలో గ్రామీణ ప్రాంత పిల్లలు అనేక ఆటలు ఆడుతూ ఉండేవారని గొల్లపల్లి బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రెడ్డి మల్లేష్ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో గ్రామస్థాయి వాలీబాల్ క్రీడల పోటీని రెడ్డి మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటలు ఆరోగ్యంతో పాటు, మంచి బంధాలు బలపడతాయని, గెలుపోటములు సహజమేనని గెలిచినవారు, మరిన్ని విజయాల కోసం శిక్షణ పొందాలని, ఓటమి చెందిన వారు, ఓటమికి గల ఒడిదొడుకులను అధిగమించి విజయాలను సాధించాలని యువతను ఉద్దేశించి అన్నారు. ఏడు జట్లు పాల్గొనగా, వాలీబాల్ కింగ్స్ కెప్టెన్ హరీష్ జట్టు టోర్నమెంట్ విజేతగా, స్పీడ్ ఈగల్ కెప్టెన్ నవీన్ జట్టు రన్నర్పుగా నిలిచారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు అంజయ్య, రెడ్డి బీరయ్య జీర్ల మల్లయ్య, రుద్రబోయిన అంజయ్య, సత్యనారాయణ, యువత తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపును రద్దు చేయాలి

- ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం వ్యాపారులు అక్రమంగా బెల్ట్ షాపులను నడుపుతున్నారంటూ వాటిని వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ బోధన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ రాజాగౌడ్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బెల్ట్ షాపులను తొలగిస్తామని ప్రకటించారని కానీ బోధన్ డివిజన్ పరిధిలోని ఎడపల్లి, రెంజల్, నవీపేట్, బోధన్, సాలురా, కోటగిరి, రుద్రూర్, చందూర్, మోస్రా మండలాలలో అనుమతి లేని బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని అన్నారు. దాని మూలంగా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గడమే కాకుండా ప్రజలు ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, వారి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయని, తాగుడు వ్యసనానికి బానిస కావడంతో కుటుంబాలలో కలహాలు జరుగుతున్నాయని అన్నారు. కావున ఎక్సైజ్ అధికారులు వెంటనే నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మద్యం బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాపంథా బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, జి.సీతారాం, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, జిల్లా నాయకురాలు బీపాషా బేగం, లక్ష్మీబాయి, కమల, వరలక్ష్మి, సిహెచ్.గంగయ్య, గణపతి, పోశెట్టి, శంకర్, కబీర్‌ఖాన్, రాజు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తుల్లో మార్పుపై గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వాటిలో కొన్ని మార్పులు చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వులతో గురువారం కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. గృహ జ్యోతి పథకానికి సంబంధించి వినియోగదారుల గ్యాస్ కనెక్షన్ నెంబర్లు తప్పులు లేకుండా సరిచేయాలన్నారు. వారి మీటర్ల వద్ద కుటుంబ యజమాని ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నెంబర్లను రాసిపెట్టి ఉంచాలని, ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి గ్యాస్ కనెక్షన్ నెంబర్లను సరిచేయాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. వినియోగదారుల దరఖాస్తు ఫారాలలో ఎలాంటి తప్పులు లేకుండా సరిచేయాలని వారు పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీవో గౌస్ మొయినుద్దీన్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేతనాలు రాలే

నవతెలంగాణ-వర్ని

ఆశా కార్యకర్తలకు రెండు నెలల జీతాలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వెంటనే తమ జీతాలు చెల్లించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో వర్ని తహసీల్దార్ నారాయణకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం, అధికారులు ఆశా కార్యకర్తల జీతాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వీడనాడాలని, జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నన్నేసాబ్, ఆశాకార్యకర్తలు బాలమణి, రాధ, నాగమణి, పల్లవి తదితరులున్నారు.



వినతి పత్రం అందజేత

విద్యుత్ అధికారులకు సహకరించాలి

నవతెలంగాణ-జుక్రాన్‌పల్లి

మండలకేంద్రంలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని లైన్మెన్ బలరాం గురువారం తెలిపారు. గృహజ్యోతి పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 200 స్కీమ్ గురించి విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికి వచ్చి ఆధార్ కార్డు రేషన్ కార్డ్ ఫోన్ నెంబర్లు అడిగిన వెంటనే ఇచ్చి సహకరించాలని తెలియజేశారు. మండల కేంద్రంలో గురువారం ప్రతి ఇంటికి విద్యుత్ శాఖ అధికారులు వెళ్లి గృహ జ్యోతి పథకానికి అర్హులైన వారి దగ్గర ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, ఫోన్ నెంబర్ వివరాలు సేకరించారు.



రోడ్లపై చెత్త తొలగింపు

నవతెలంగాణ-ముప్కాల్

ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కలిసి ప్రధాన రోడ్లపై, పలు కాలనీల్లో చెత్త చెదారాలను తొలగించారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు గ్రామస్తులకు పారిశుధ్య కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వి.జగన్నాథ్ చారి, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, ఎంపీడీవో దామోదర్, ఎస్సై భాస్కరా చారి, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ కో అప్షన్ సభ్యులు మునిరోద్దీన్, పంచాయతీ సెక్రటరీ విజయ్ కుమార్, అంగన్ వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి గణిత శిక్షణకు జిల్లా ఉపాధ్యాయులు ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్



ఈనెల 13 నుండి 17 వరకు గుజరాత్ రాష్ట్రంలోని ఐఐటి గాంధీ నగర్‌లో జరిగే సెంటర్ ఫర్ క్రియేటివ్ లర్నింగ్ జాతీయస్థాయి గణిత శిక్షణా శిబిరానికి నిజామాబాద్ జిల్లా నుండి జెడ్పిహెచ్‌ఎస్ మెంట్రాజ్‌పల్లి గణితోపాధ్యాయుడు టి.కృష్ణ జెడ్పిహెచ్‌ఎస్ మల్కాపూర్ ఎం ఉపాధ్యాయుడు ఆర్ గోపాలకృష్ణ, జెడ్పిహెచ్‌ఎస్ కోన సముందర్ ఉపాధ్యాయుడు కే. సతీష్ రెడ్డి ఎన్నికయ్యారని జిల్లా విద్యాధికారి ఎన్ వి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ.. జాతీయస్థాయి గణిత విభాగంలో జరిగే శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రం నుండి వందమంది గణిత ఉపాధ్యాయులను ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారని పేర్కొన్నారు. జిల్లా నుండి జాతీయ స్థాయి గణిత శిక్షణ కార్యక్రమాన్ని ఎన్నికైనందుకు వారిని డిఈఓ, టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షులు కాంతారావు గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు.

ఎరువుల్లో వ్యత్యాసం ఉండకూడదు

- జిల్లా వ్యవసాయాధికారి వాజిద్



తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ గురువారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, భౌతిక నిల్వలను ఫెర్టిలైజర్స్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టంలో అప్‌లోడ్ చేశారు. అలాగే వీటికి సంబంధించిన పలు సూచనలు డీలర్లకు ఆయన ఇచ్చారు. రైతులు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వడంతోపాటు ఎరువుల ధరల పట్టిక నిల్వల పట్టిక రైతులకు కనిపించే విధంగా పెట్టాలన్నారు. ఆయన వెంట స్థానిక మండల వ్యవసాయాధికారిని జోస్న భవాని, విస్తీర్ణ అధికారులు విజయ్, గంగాధర్ ఉన్నారు.

సిబ్బందికి వివరాలు అందించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అందుబాటులో లేనివారు విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో, విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో వివరాలను ధ్రువీకరించుకోవచ్చని ఎన్పిడిసిఎల్ ఎస్ఈ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకంకోసం ప్రజా పాలనా కార్యక్రమంలో అందచేసిన సమాచార ధ్రువీకరణ సిబ్బంది ద్వారా జరుగుతుందన్నారు. ప్రజా పాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) నెంబర్, ఆధార్ కార్డు నెంబర్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఒకవేళ ఏదైనా కారణం వల్ల సిబ్బంది వచ్చినపుడు మీరు అందుబాటులో లేనట్లయితే పైన తెలిపిన వివరాలను దగ్గరలో గల విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో కాని, లేదా విద్యుత్ సహాయ గణక అధికారి కార్యాలయంలో కాని ధ్రువీకరించుకోవాలని తెలిపారు.

డ్రైనేజీలకోసం రూ.లక్ష

- జెడ్పిటిసి నిధుల నుంచి కేటాయింపు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానాకుర్ది గ్రామంలో గ్రామం నుండి వ్యవసాయ పొలానికి వెళ్లే దారిలో గ్రామంలోని మురికి నీరు ప్రవహిస్తుంది. అటు నుండి వెళ్లి బాటసారులు, ట్రాక్టర్లు, వెహికల్స్ వెళ్లరాకుండా బురదమయం అవుతుంది. దీంతో నవతెలంగాణ విలేకరి జడ్పిటిసిని సంప్రదించగా వెంటనే జడ్పిటిసి కమల నరేష్ వెంటనే తన నిధుల నుండి లక్ష రూపాయలను డ్రైనేజీ నిర్మాణం కొరకు మంజూరు చేస్తున్నట్టు ప్రకటనలో తెలిపారు. దీనికి గ్రామస్తులందరు సంతోషించి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సాయిలు కోరారు. గురువారం మండలంలోని ముల్లంగి(ఐ) గ్రామంలో గృహజ్యోతి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. 200 యూనిట్ల కరెంట్ ఉచిత అమలుకు వినియోగదారులు తమ ఆధార్ నెంబరు, ఫోన్ నెంబర్, తెల్లరేషన్ కార్డు నెంబరు అందజేయాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశాలు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని ఆశా వర్కర్లు దేశవ్యాప్త సమ్మె నోటీసును గురువారం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం మోహన్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలను, వైఫల్యాలపై సమ్మె చేపట్టినట్టు తెలిపారు. ఆశావర్కర్లకు పనిని బట్టి పారితోషికాల పద్ధతిని రద్దు చేయాలని, కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేకసార్లు కేంద్ర ప్రభుత్వాన్ని అడిగారని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిష్కారం చేయలేదని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ బడ్జెట్ తగ్గించి నిర్వీర్యం చేస్తుందన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సిరికొండ ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల గోవర్ధన్, లక్ష్మి, సువర్ణ, గంగామణి, సాయమ్మ, రాజవ్వ, సరోజ విజయ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ధర్మారం(బి) పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులను మండల ప్రత్యేకాధికారి రాజేందర్, ఎంపీడీవో టివిఎస్ గోపిబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు పారిశుధ్య వారోత్సవాలపై శ్రద్ధ చూపాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి రాజలింగం పాల్గొన్నారు.

హద్దు మీరుతున్న పోకిరి చేష్టలు

- నకిలీ తుపాకీతో హల్‌చల్
- భయాందోళన చెందుతున్న స్థానికులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలో కొందరి పోకిరీ చేష్టలు రోజురోజుకీ హద్దుమీరుతున్నాయి. నకిలీ తుపాకీ(లైటర్‌గన్)తో పలువురిని భయపెడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈనెల 3న రాత్రి ఆయిదో టౌన్ పరిధిలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. ఇంటర్ చదువుతున్న ముగ్గురు యువకులు కేంద్రీయ విద్యాలయం సమీపంలో చీకట్లో నకిలీ తుపాకీతో శబ్దం చేస్తూ హల్‌చల్ చేశారు. ఈ ప్రాంతంలో ఉండే మినీ ట్యాంక్ బండ్‌కు మహిళలు, యువతతో పాటు ఫ్యామిలీస్ సాయంత్రం వేళ సేద తీరేందుకు వస్తుంటారు. నకిలీ గన్‌తో శబ్దం చేయడంతో దారి వెంట వచ్చి వెళ్లేవారు భయానికి లోనవుతున్నారు. చివరకు మహిళా హోంగార్డు శబ్దాన్ని గుర్తించి స్థానికుల సాయంతో ముగ్గురిని పట్టుకుంది. అనంతరం టౌన్‌లో అప్పగించగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. గంజాయి మత్తులో యువత వీటిని అడ్డుపెట్టుకొని పలువురిని భయపెట్టి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదేక్రమంలో నేరాల వైపు మళ్లుతున్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇకనైనా ఇలాంటి వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరం. అలాగే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఎస్సైలు, సీఐలు కేసుల విషయంలో గతంలో, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలకు సంబంధించిన వారి పెత్తనం కొనసాగించడంతో ఏమి చేయలేని పరిస్థితుల్లో ఉంటున్నారని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందని ప్రజలతోపాటు పోలీసు వర్గాలు కూడా తెలుపుతున్నాయి.

కిడ్నాపర్ల నుంచి తప్పించుకున్న విద్యార్థి

- అపహరించేందుకు పాఠశాల వద్దకు వచ్చిన వాహనం
- అర్గుల్ పాఠశాలవద్ద ఘటన

నవతెలంగాణ-జుక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ లో కిడ్నాపర్లనుంచి ఓ విద్యార్థి తప్పించుకున్నట్లు అర్గుల్ ప్రత్యేక అధికారి, మండల వ్యవసాయ అధికారి దేవిక గురువారం తెలిపారు. అర్గుల్ గ్రామానికి చెందిన విద్యార్థి జీ నాగరాజు (13) ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఉదయం తొమ్మిది గంటల 30 నిమిషాలకు పాఠశాల గేటు దాటుతుండగా అదే సమయంలో ఓమిని వ్యాన్ వాహనం నుంచి ఆడవేషంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు దిగి చాక్లెట్ ఇస్తామని పిలిచారు. బుధవారం అదే పాఠశాలలో చిన్న పిల్లల కిడ్నాపర్స్ వస్తున్నారని టీచర్స్ అవగాహన కల్పించారు. దీంతో కిడ్నాపర్ల దగ్గరికి వెళ్లకుండా టీచర్ల దగ్గరికి పరిగెత్తుకొని వెళ్లాడు. నాగరాజు అనే బాలుడిని ఎస్ఐ తిరుపతి, మండల వ్యవసాయ అధికారి దేవిక వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిసి కెమెరా ఫుటేజ్ పరిశీలిస్తున్నామని ఎస్సై తెలిపారు.



కిడ్నాప్‌నుంచి తప్పించుకున్న విద్యార్థి నాగరాజు

చెరువు దారిలో చెత్త తొలగింపు

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలోని ఊర చెరువుకు వెళ్లే రహదారి చెత్తతో నిండి దుర్గంధంతో ఉండగా గురువారం ఎంపీడీవో లక్ష్మణ్ దగ్గరుండి తొలగింపజేశారు. సబ్‌స్టేషన్ వెనుకాల చెత్తను తీయించారు.



చెత్తను తీయిస్తున్న అధికారులు

నెంబర్ ప్లేట్లు లేకుంటే చర్యలు

- ఎస్సై తిరుపతి



నెంబర్‌ప్లేట్లు బిగిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జుక్రాన్‌పల్లి

నెంబర్ ప్లేట్లు లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై తిరుపతి గురువారం అన్నారు. డిచ్‌పల్లి సిఐ కె. మల్లేష్ అధ్వర్యంలో ఎస్ఐ, సిబ్బంది నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి శారు. వాహన దారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం నంబర్ ప్లేట్ లను బిగించి పంపినట్టు పోలీసులు తెలిపారు. నేరస్థులు నంబర్ ప్లేట్ లేని వాహనాలతో చైన్‌స్నాచింగ్, దొంగతనాలు, నేరాలకు పాల్పడుతున్నరని అన్నారు. కావున వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, హెల్మెట్‌ను ధరించాలని, నెంబర్ ప్లేట్ సరిగాలేకున్నా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.

రెండు పార్టీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నవి

మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న జోగు రామన్న

కాంగ్రెస్ బిజెపి రెండు పార్టీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నవని, ఇక ఆ పార్టీలపై యుద్ధమేనని మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ చేతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలుబొమ్మగా మారారని, ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ తెలంగాణ రాష్ట్రంకు ముఖ్యమంత్రి కావడం దౌర్భాగ్యం అని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ సర్పంచ్ ఇతర ఎన్నికల్లోనైనా పోటీకి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్న నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి, పట్టణ మండల అధ్యక్షులు పూజ నరేందర్, ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి జడ్పిటిసి మెట్టు సంతోష్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం..

నియోజకవర్గంలోని నందిపేట్, ఆలూర్, ఆర్మూర్ మండలాలలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులను మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు పుట్టింటి లింబారెడ్డి, చేపూర్, పిప్రి, ఖానాపూర్, ఆలూర్, దేగమ్, అందాపూర్, ఫతేపూర్ గ్రామాల సర్పంచులు ఇందూరు సాయన్న, ఆశాపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, సింగిరెడ్డి మోహన్, కళ్లెం మోహన్ రెడ్డి గడ్డం సరోజ గంగారెడ్డి, పుట్టా లక్ష్మి శ్రీనివాస్,, లక్ష్మి, పిప్రి సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి, గడ్డం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిది

నవతెలంగాణ-డిచ్‌పల్లి



జీపీ పాలకవర్గాన్ని సన్మానించిన రాంపూర్‌సొసైటీ సభ్యులు

ఐదేళ్లపాటు గ్రామాభివృద్ధికి సర్పంచ్ పాలకవర్గం, సహకార సొసైటీ సభ్యులు కలిసికట్టుగా కృషి చేసి గ్రామాన్ని, సొసైటి పరిధిలో ఉన్న వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చేసిన మరువలేనిదని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రాంపూర్ చైర్మన్ బి. తారాచంద్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని రాంపూర్ సహకార సొసైటీ ఆధ్వర్యంలో సర్పంచులకు సహకార సొసైటీ సభ్యులకు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా చైర్మన్ తరచంద్ నాయక్ మాట్లాడుతూ... ఐదేళ్లపాటు గ్రామాల్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు బాధ్యతాయుతంగా పనులు చేసినందుకు సర్పంచులకు, ఉపసర్పంచులకు, వార్డు సభ్యులకు అభినందనలు తెలిపారు. రాబోవు రోజుల్లో తమ గ్రామాలలో సామాజిక కార్యక్రమాలు చేస్తూ, ప్రజలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్లు పాపాయి తిరుపతి, లోలం సత్యనారాయణ ,తెలుగణేష్, నల్లవెల్లి నర్సయ్య,సంతోష్, ఉపసర్పంచ్లు రఘునథన్ రాము, యేంకనోల్ల రమేష్, సొసైటి వైస్ చైర్మన్ స్వామి, సిఈఓ నాగరాజ్, డైరెక్టర్లు రాజ్ కుమార్ , గంగాధర్, శ్రీనివాస్, రమేష్, నాగేశ్వర్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి విరాళం




విరాళం అందజేస్తున్న ముస్కుభూమేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో దులగుట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న అమ్మవారి ఆలయం (శుక్రవారం గుడి) కోసం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, ముప్కాల్ మాజీ సర్పంచ్ ముస్కు భూమేశ్వర్ రెడ్డి తనవంతు సాయం (విరాళం)గా రూ.100,016 ఆలయ ట్రస్టు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు సభ్యులు విరాళం అందజేసిన ముస్కు భూమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు కంచు విజయ్, టి.సాయన్న, గద్దల గంగారాం, చిన్న బాల్ రాజ్, గొర్రె చిన్న రాజన్న, ద్యావతి శివలింగం, గంగారాం, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు..

మెస్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి

- పిడిఎస్‌యూ



నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీ విద్యార్థుల మెస్ బిల్లులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని టియూ పిడిఎస్‌యూ కార్యదర్శి జయంతి డిమాండ్ చేశారు. యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూనివర్సిటీలలో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకుంటున్నారని, మెస్ బిల్లులు ప్రభుత్వం ఇచ్చే దానికన్నా నెలవారీగా వేల రూపాయలు విద్యార్థులకు అదనపు భారంగా మారుతున్నాయని , పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి ప్రభుత్వమే చెల్లించాలని, పీజీ ఇంటిగ్రేటెడ్ విద్యార్థులకు నెలకు 3000 ఫెలోషిప్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 3700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్స్ నిధులు విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రవీందర్, అక్షయ్,ఆకాష్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

వంద శాతం లబ్దిదారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ తెలిపారు. గురువారం నిజామాబాద్ పట్టణంలోని బోర్ గావ్, పాంగ్రా వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఫేస్ 2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.ధర్మ నాయక్ మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. క్యాలెండర్ పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్ ఫోన్ ద్వారా స్కానింగ్ చేస్తే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ తెలిసిపోతాయని, ఈ సదుపాయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు.

ప్రజల ముంగిట్లోకి కేంద్ర పథకాలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తేవడం జరిగిందని ఎల్‌డిఎం యు.నాగ శ్రీనివాసరావ్ అన్నారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారితో సభలో వారి అనుభవాలను, అనుభూతులను స్వయంగా వివరించారు. అర్హులైన లబ్ధిదారులు అందరికీ పథకాల ప్రయోజనాలు అందుతాయని, అందుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం సంకల్ప యాత్ర ద్వారా వచ్చిన అధికారులకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అంతకుముందు స్థానికులతో వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సౌజన్య, బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, బ్యాంక్ మేనేజర్, అగ్రికల్చర్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | ఫిబ్రవరి 09, 2024 | www.navatelangana.com

కూల్చేసిన హాస్టల్ బిల్డింగ్ పరిశీలన



నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో గల ఎస్సీ హాస్టల్ పురాతన బిల్డింగు కూల్చేశారు. కొత్త బిల్డింగ్ నిర్మాణం కోసం పట్టించుకోకపోవడం లేదు. ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినీల అవస్థలు ఇబ్బందులు ఎదురయ్యే వాటిపట్ల జీపి ప్రత్యేక అధికారి డాక్టర్ బండి వార్ విజయ్ స్పందిస్తూ గురువారం ఎస్సీ బాలికల హాస్టల్ కూల్చేసిన పాత బిల్డింగ్‌ను సందర్శించి పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ గంగా సుధా మాట్లాడుతూ.. హాస్టల్ బిల్డింగ్ సమస్య విషయమై ఆరా తీశారు.

ఎమ్మార్పీఎస్, బీఎస్పీ ఆధ్వర్యంలో సిఐకి సన్మానం



నవతెలంగాణ-కామారెడ్డి

ఎమ్మార్పీఎస్, బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డి పట్టణ సిఐని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.బాగయ్య మాట్లాడుతూ.. పట్టణ సిఐగా చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన బాధ్యతను విస్మరించకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల కోసం పాటుపడడం అభినందనీయమన్నారు. ఇలాంటివారు కొందరే ఉంటారని అలాంటి వ్యక్తి కామారెడ్డి పట్టణ సిఐగా రావడం పట్టణ ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో మాదిగ యూత్ ప్రెసిడెంట్ (ఎంఆర్పిఎస్) కోటి అశోక్ మాదిగ, బీఎస్పీ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర శివరాజు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కొత్తూరు గంగయ్య, తిప్పాపూర్ రాజయ్య, రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ధర దక్కుతుందా.. లేదా..?

- చేతికొచ్చిన ఎర్రజొన్న పంట
- సిద్ధమవుతున్న సిండికేట్లు
- ఆందోళనలో రైతులు



నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి జిల్లాలలోని ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లోని వేల్పూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, మెండోర, ముప్కాల్, నందిపేట్, ఆలూర్, డొంకేశ్వర్ మండలాల్లోని ఎర్రజొన్న పంట పండిస్తారు. ఎర్ర జొన్న పంట లోను ముందస్తు ఒప్పంద ధర అమలు కాక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎర్ర జొన్న పంటను కొనుగోలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్ర జొన్న రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవు. సీజన్ అంతా ఒకే ధర ఉండేలా చూడాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి..



ఎర్ర జొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. వ్యాపారులు సిండికేట్ గా మారి పంట ధరను తగ్గించే ప్రమాదం ఉంది. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

బండమీది సుభాష్, రైతు, గోవింద్‌పేట్

ఒప్పందాలు చేసుకుంటేనే మేలు

ఎర్ర జొన్నలతో పాటు ఇతర విత్తన పంట సాగు చేసే రైతులు సీడు వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుంటేనే మేలు కలుగుతుంది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సీడు సాగు విషయంలో ఒప్పందాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

విజయలక్ష్మి, ఏడిఏ, ఆర్మూర్

ధరపై ఆందోళనలో రైతన్నలు...

ఎర్ర జొన్న పంటను డివిజన్‌లోని పలు మండలాల్లో రైతన్నలు ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రాగా మరి కొద్ది రోజుల్లోనే పంట కోతలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ధర దక్కుతుందా లేదా అనే రైతులు ఆందోళన చెందుతున్నారు. వాణిజ్య పంట అయిన ఎర్రజొన్న విత్తనాలను వ్యాపారులు సరఫరా చేస్తారు. 100 రోజులలో చేతికి వచ్చే ఎర్ర జొన్న ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా పంట పెట్టుబడి తడిసి మోపెడయ్యింది. అయినప్పటికీ రైతులు సాగుకు వెనకడుగు వేయలేదు. కానీ ధరపైనే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య పంట కావడంతో విత్తనాలు సరఫరా చేసే సమయంలోనే రైతులతో వ్యాపారులు ఒప్పందం చేసుకుంటారు. కానీ ప్రస్తుత సంవత్సరం ముందస్తుగా ఒప్పందం చేసుకోలేదు. దీంతో పంటను బహిరంగ మార్కెట్లో విక్రయించాల్సిన పరిస్థితి ఉంది. గత సంవత్సరం క్వింటాలకు చివరిలో 5000 వరకు ధర పలికింది.. ముందుగా క్వింటాలుకు నాలుగు వేలకు కూడా కొనుగోలు చేయలేదు. వ్యాపారులు సిండికేట్గా మారి రైతులను నిలువునా ముంచారు. ప్రస్తుత సంవత్సరం క్వింటాలకు 5000 కంటే ఎక్కువ ధర పలుకుతుందని రైతులు ఆశిస్తున్నారు. కానీ రైతుల ఆశలు నెరవేరాలంటే వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సజ్జ పంటకు ప్రస్తుత సంవత్సరం క్వింటాలుకు ఎనిమిది వేల వరకు ధర పలకనున్నది. ఈ నేపథ్యంలో ఎర్రజొన్న పంటకు కూడా మంచి ధర ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు..

పశువులకు దానాగా ఎగుమతి..

డివిజన్‌లో పండించే ఎర్రజొన్నలకు నార్త్ ఇండియాలో మంచి డిమాండ్ ఉంటుంది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. అక్కడ పశువులకు దానాగా వాడుతారు.

బై బ్యాక్ ఒప్పందం ఉన్నా ధర తగ్గింపు..

బై బ్యాక్ ఒప్పందంతో గత సంవత్సరం ధరను 4000 వరకు ఇస్తామని చెప్పారు. కానీ ధర లేదనే సాకుతో క్వింటాలకు వెయ్యి రూపాయల వరకు ధర తగ్గించగా రైతులు నష్టపోవాల్సి వచ్చింది. జిల్లాలో 2022 సంవత్సరంలో 60 వేల ఎకరాల్లో పంట సాగు చేయగా, గత సంవత్సరం 40, వేల ఈసారి 45 వేల ఎకరాలలో పంటను వేశారు.

2008లో ఎర్ర జొన్న రైతుల ఉద్యమం..
2014 సంవత్సరంలో ఫలించిన రైతుల నిరీక్షణ...

2008 సంవత్సరం ఎర్ర జొన్న రైతుల ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. గిట్టుబాటు ధర కోసం ఎర్రజొన్న రైతులు చేపట్టిన ఉద్యమంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు కాల్పులు జరపగా కొంతమంది రైతులకు తూటాలు తగిలి గాయపడ్డారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపగా అదే రోజు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్మూర్‌కు వచ్చి రైతుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు..2014లో జిల్లాల్లో ఎర్ర జొన్న రైతులకు రావలసిన 9.80 కోట్ల బకాయిలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడు నియోజకవర్గాలకు చెందిన దాదాపు 25 వేల రైతులకు ప్రయోజనం కలిగింది.

నీళ్ళలో జారిపడి ఒకరి మృతి

నవతెలంగాణ-ఏర్గట్ల

నీళ్ళల్లో జారిపడి మృతిచెందిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్ల గ్రామానికి చెందిన చేపూర్ నారాయణ (66) గురువారం కాకతీయ కాలువ వద్ద గల శుక్రవారం దేవి ఆలయం సమీపంలో బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందినట్లు తెలిపారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

పీడీఎస్‌యూ గిరిరాజ్ కళాశాల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పిడిఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పిడిఎస్యు నగర కమిటీ అధ్యక్షులు షేక్ అషర్ మాట్లాడుతూ.. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వం కళాశాలలో అనేక సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా ల్యాబ్స్ లైబ్రరీ, బోధన, బోధనేతర సిబ్బంది కొరత సాంకేతిక పరికరాల కొరత ఉందని పేర్కొన్నారు. ప్రగతిశీల విధానంతో విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కమిటీ అధ్యక్షులుగా నాగేష్, ప్రధాన కార్యదర్శిగా సలీం, ఉపాధ్యక్షులు భాను, రంజాన్, సహాయ కార్యదర్శిగా నసీర్, సంతోష్, కోశాధికారిగా అరుణ్ ఎన్నుకోబడ్డారు. వీరితోపాటు మరో 18 మంది విద్యార్థులు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కళాశాల కమిటీ 25 మంది విద్యార్థులతో ఎన్నుకున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో అధిక శాతం ఓట్లు సాదిద్దాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గావ్ చలో అభియాన్ పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. 51శాతం ఓట్లు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు సాధించే విధంగా కృషి చేయాలని కార్యకర్తలను సూచించారు. కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా కార్యదర్శి పానుగంటి సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు భూషణ్, ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ మహేందర్ గౌడ్, మహేందర్, వినోద్ రెడ్డి తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంజీవ్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ ఆధ్వర్యంలో పరామర్శించారు. అయన వెంట నాయకులు జెసిబి శ్రీనివాస్, బొక్కల బాలయ్య, వై.గంగారెడ్డి, అరుగుల పెద్ద బాల్ రెడ్డి, నర్సారెడ్డి, రవి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై దృష్టి సారిస్తారు

- ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌బికేఎస్ వైద్యులు విజయ్‌భాస్కర్

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారని జిల్లా ఆస్పత్రి ఆర్బికేఎస్ వైద్యులు విజయ్‌భాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రి ఆర్‌బిఎస్‌కే వైద్య బృందం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎడపల్లి తెలుగు మీడియం పాఠశాలలో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్, మందులు, మాత్రాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్ణ, ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిర్లక్ష్యపు నీడలో మిషన్ భగీరథ

- రైతు పట్టా భూమిలో వేసిన వైనం

నవతెలంగాణ-ఎడపల్లి



రైతు పట్ట భూమిలో మిషన్ భగీరథ పైప్‌లైన్

గ్రామాలకు పంపిణీ చేసే మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ నిర్మాణంలో అధికారులు చేసిన తప్పునకు రైతే స్వయంగా తన పొలంలో వేసిన పైప్‌లైన్ తన సొంత ఖర్చులతో తొలగించుకోవాల్సి వచ్చింది. ఫలితంగా సదరు రైతు గత నాలుగైదు రోజులుగా తన పట్టా భూమిలో నుంచి పైప్‌లైన్ నిర్మాణం తొలగించి మరోచోటునుంచి వేస్తుండడంతో 5 గ్రామాల ప్రజలకు గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఎడపల్లి మండలంలోని జంలం గ్రామ శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణాన్ని జావిద్ అనే ఓ రైతు పంటపొలంలో నుంచి వేశారు. రైతు అనుమతి లేకుండా పంటపొలంలో నుంచి వేయడం వలన తనకు ఇబ్బందిగా వుందని పేర్కొంటూ రైతు తన భూమిలో నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ తొలగించి ఇతర ప్రదేశానికి షిఫ్ట్ చేయాలని కోరుతూ.. జిల్లా కలెక్టర్‌కు గత ఆరు నెలల క్రితం మొరపెట్టుకున్నారు. పలుమార్లు కలెక్టర్‌ను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు కలెక్టర్ మిషన్ భగీరథ అధికారులకు పైప్‌లైన్ సమస్య పరిష్కరించాలని ఆదేశించడంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ తొలగించడానికి, మరోచోటుకు షిఫ్ట్ చేయడానికి నిధులు లేవని చేతులెత్తేశారు. దీంతో చేసేది లేక రైతు తన సొంత ఖర్చుతో తానే పైప్‌లైన్ తొలగించి మరోచోటుకు బదిలీ చేస్తానని అంగీకరించడంతో అధికారులు రైతుకు పైప్‌లైన్ తొలగించుకోవడానికి అనుమతించారు. దీంతో రైతు పైప్‌లైన్ తొలగించి, మరో చోటుకు లైన్ షిఫ్ట్ చేసే పనికి శ్రీకారం చుట్టారు. దీంతో గత ఐదు రోజులుగా పనులు జరుగుతుండడంతో మండలంలోని జైతాపూర్, ఎమ్మెస్సి ఫారం, బాపూనగర్, జానకంపేట్, పోచారం, నెహ్రూనగర్ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాలేదు. అంతేకాకుండా బుధవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు భగీరథ నీటి సరఫరా బంద్ అయింది. దీంతో ఈ గ్రామాలలో తాగునీటికి, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా వుండగా అనుభవం లేని వ్యక్తులతో రైతు పైఫ్‌లైన్ తొలగించి ఇష్టానుసారం మరో చోటుకు పైప్‌లైన్ షిఫ్ట్ చేస్తున్నారు. దీన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు పనులు జరిగే చోట అడ్రస్ లేకుండా పోయారు. పనులు సరిగా చేయని పక్షంలో పైప్‌లైన్ లీకై తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉందని, అధికారులు దగ్గరుండి పనులు జరిపించి పైప్‌లైన్ పనుల్లో సమస్యలు రాకుండా చూడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నకిలీ ధ్రువపత్రంతో కండక్టర్ ఉద్యోగం

- ఫిర్యాదుతో బయట పడ్డ వైనం
- రిటైర్మెంట్‌తో తర్వాత వెలుగుచూసిన ఘటన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నకిలీ ధ్రువపత్రంతో సమర్పించి ఆర్టీసి లో కండక్టర్ ఉద్యోగం 1986 లో సాధించాడు. పదవి విరమణ పొందిన తర్వాత కలెక్టర్‌కు ఫిర్యాదుతో విషయం బయట పడింది. ఈ ఘటన జిల్లాలో ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. నగరం లోని బోర్గామ్ (పి) గ్రామానికి చెందిన చంద్ర శేఖర్ అనే వ్యక్తి 1986లో కండక్టర్ ఉద్యోగానికి ఎంపిక అయ్యి ఆర్టిసి ఒకటవ డిపో లో కండక్టర్ గా పని చేస్తూ ప్రమోషన్లతో ఎడిసి పదవితో పదవి విరమణ పొందాడు. అనంతరం నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉద్యోగం సాధించాడని కలెక్టర్ కి పిర్యాదు అందడంతో ఆర్టీసి అధికారులకు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో 1983 లో బోధన్ తహసీల్దార్ కార్యాలయం నుండి ఎస్సీ (బుడిగ జంగం) కుల ధృవీకరణ పత్రం సమర్పించి ఉద్యోగం సంపాదించారు. అదేవిధంగా రిటైర్మెంట్ సమయంలోను నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించడంతో బయట పడింది. దీంతో ఆర్టీసీ డిపో-1 డీఎం సంపూర్ణానంద్ బుధవారం ఒకటవ టౌన్‌లో చంద్రశేఖర్‌పైన ఫిర్యాదు చేశారు. ఒకటో టౌన్ ఎస్ఐ విజయ్ బాబు %క్రీూజ% 406, 420,468, 471 సెక్షన్ ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు దర్యాప్తు చేస్తామని చెప్పారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

జిపి ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్ర మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పాత బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, మూత్రశాల నిర్మాణం కోసం నాలుగు లక్షల నిధులు అలాగే పంచాయతీ పరిధిలో సిసి రోడ్ల నిర్మాణం కోసం 15 లక్షల నిధులు మొత్తం 19 లక్షల నిధులు ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు కృషి కారణంగా మంజూరైనట్లు మద్నూర్ జీపి ప్రత్యేక అధికారి డాక్టర్ బండివార్ విజయ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంజూరైన నిధులతో మద్నూర్ పాత బస్టాండ్ సమీపంలో నాలుగు లక్షల నిధులతో మరుగుదొడ్లు ముత్రశాలలు నిర్మిస్తామని పంచాయతీ పరిధిలోని అత్యవసరం గల వార్డుల్లో సిసి రోడ్లు నిర్మాణం కోసం 15 లక్షల నిధులు మంజూరైన వాటితో సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపడతామని తెలిపారు.

జాతర బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలి

- ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసిన అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి



ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి సన్మానం

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 17న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు జరగనున్నాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సుప్రియ, ఆలయ ఈఓ వేణు, కార్యదర్శి రఘు, ఆలయ అర్చకులు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్వగృహంలో ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు బోధన్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

శాస్త్రీయ విద్యావిధానంకోసం పోరాడాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

సమసమాజ స్థాపన కోసం, శాస్త్రీయ విద్యా విధానం కోసం, పీడితులకు, అణగారిన వర్గాల ప్రజలకు అండగా పోరాడాలని, ప్రశ్నించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని పడకల్, కలిగోట్ ఉన్నత పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రగతిశీల భావాలను అలవరుచుకొని విద్యాహక్కు చట్టంలోని హక్కులను పొందాలని, ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ ప్రశ్నించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు ప్యాట్ల మమత, మండల అధ్యక్షులు ప్రణయ్, నాయకులు వర్షిత్, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ పాత బస్టాండ్‌కు నిధులు మంజూరు

- జిపి ప్రత్యేక అధికారి డాక్టర్ విజయ్ వెల్లడి
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో ప్రయాణికులకు మరుగుదొడ్లు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతరావు స్పందించి ప్రత్యేక కృషితో మద్నూర్ పాత బస్టాండ్ సమీపంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మాణాలకు నాలుగు లక్షల నిధులు మంజూరు చేయించినట్లు మద్నూర్ పంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ బండి వార్ విజయ్ గురువారం తెలిపారు. నిధులు మంజూరు చేయించడంతో గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల నిజాయితీ

- రోడ్డులో దొరికిన పర్సును బాధితునికి పోలీసుల ద్వారా అప్పగింత

నవతెలంగాణ-కామారెడ్డి



బాధితుడికి పర్సు అందజేత

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం ఆర్కే డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డుపై మనీపర్స్ దొరకగా దానిని పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా కామారెడ్డి హెచ్ఎస్ఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలో ఆర్కే డిగ్రీ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న సంపత్, అతని స్నేహితులైన ప్రవీణ్, వినయ్ ముగ్గురు కలిసి కాలేజీ నుంచి జీవదాన్ హాస్పిటల్ వైపు వస్తుండగా, రోడ్డుపై పర్సు దొరకగానే వెంటనే డయల్ 100కు కాల్ చేసి పట్టణ పోలీస్టేషన్‌కు వచ్చారన్నారు. ఆ తర్వాత విచారణ చేయగా ఆ పర్స్ పోగొట్టుకున్న వ్యక్తి పేరు కార్తీక్, ఐలాపూర్ గ్రామస్తుడు అని తెలిసింది. ఇతడు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పనిచేసుకుంటూ ఉంటాడని, ఆ పర్సులో రూ.23వేల ఉన్నాయని తెలవగా, అతనిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, అతని డబ్బులను సంపత్ చేతుల మీదుగా ఇప్పించారు. ఈ విధంగా దొరికిన డబ్బులను వెంటనే పోలీసులకు తెలియజేసి, అప్పగించిన సంపత్, ప్రవీణ్, వినయ్‌లను సన్మానించామన్నారు. అందరు ఈ విధంగానే సహకరిస్తూ ఏ చిన్న సమాచారమైన తెలిసిన తమకు సమాచారం అందిస్తే అందుకు తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు.